కాల్వ ఇలా.. నీరు పారేదెలా..?

వెల్గటూర్, జూలై 26: ఎస్సారెస్పీ కాల్వలు అధ్వానంగా మారాయి. దశాబ్దాలుగా రైతన్నకు ఆరుదుగా మారి, సాగుకు భరోసానిచ్చిన ఆ కెనాళ్లు ప్రస్తుతం నిర్వహణ లేక ఆనవాళ్లు కోల్పోయాయి. అందుకు వెల్గటూర్ మండలంలో 13 గ్రామాలకు నీరందించే ఎస్సారెస్పీ డీ83/బీ ప్రధాన కెనాలే నిదర్శనంగా నిలుస్తున్నది. దాదాపు 20వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే ఈ కెనాల్ పూడిక, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ఈ సీజన్‌లో సాగుకు నీరందే అవకాశమే లేకుండా పోగా, రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కాలువను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

పిచ్చిమొక్కలతో నిండిపోయిన కాల్వ

ఎక్లాస్‌పూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల నీటిలో వేసిన బండర్లాళ్ల పైనుంచి నడుస్తున్న విద్యార్థులు, ప్రధాన ద్వారం వద్ద బురద

ఎక్లాస్‌పూర్ స్కూల్ అధ్వానం

- ఆవరణ అంతా బురద మయం
- ఎక్కడికక్కడ నిలుస్తున్న వర్షపు నీరు
- తరగతి గదుల్లోకి వెళ్లేందుకు పిల్లల సర్కస్ ఫీట్లు
- కలెక్టర్ ఆదేశించినా మారని తీరు

ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

మంథని రూరల్, జూలై 26 : మంథని మండలం ఎక్లాస్‌పూర్ ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాల అధ్వానంగా మారింది. కొద్ది రోజులుగా పడుతున్న వర్షాలకు ఆవరణ చెరువులా మారడం, స్కూల్‌కు వచ్చే రోడ్డు బురదమయంగా తయారవడంతో పిల్లలు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలు ఒకే కాంపౌండ్‌లో ఉన్నాయి. హైస్కూల్‌లో సుమారుగా 150 మంది, ప్రాథమిక పాఠశాలలో 60 మంది అభ్యసిస్తున్నారు. చిన్నపాటి వాన పడినా చాలు ఆవరణ అంతా నీటితో నిండిపోతున్నది. తరగతి గదులకు రావాలంటే నీటిలో ఏర్పాటు చేసిన ఇటుకలపై నడుస్తూ సర్కస్ ఫీట్లు చేయాల్సిన పరిస్థితి దాపురించింది. ఇంకా తరచూ వర్షపు నీరు నిలుస్తుండడంతో పిచ్చి మొక్కలు పెరగడంతో పాటు దోమలు ఉధృతి కూడా పెరుగుతుండడంతో పిల్లలు చదువుకోలేకపోతున్నారు. ఈ నెల 4న కలెక్టర్ కోయ శ్రీహర్ష ఎక్లాస్‌పూర్‌లోని జడ్పీ, ప్రాథమిక పాఠశాలను సందర్శించి, గ్రౌండ్‌లో నీరు నిల్వ ఉండటాన్ని గమనించి ఆగ్రహించారు. గ్రౌండ్ లెవలింగ్ పనులు చేపట్టి వెంటనే చేపట్టాలని ఆదేశించారు. కానీ, రోజులు గడుస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. మళ్లీ కలెక్టర్ దృష్టి సారిస్తేనే సమస్య పరిష్కారమవుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

సాగునీటి కోసం..

బీఆర్ఎస్ బృందం కాళేశ్వరం యాత్ర

- ఉదయమే గోదావరిఖని నుంచి బయలు దేరిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు
- గోదావరి, మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంప్‌హౌస్ పరిశీలన

మహదేవపూర్ మండలం కన్నెపల్లి పంపుహౌస్‌ను పరిశీలిస్తున్న కేటీఆర్, బీఆర్ఎస్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

గోదావరిఖని-మంచిర్యాల బ్రిడ్జిపై నుంచి గోదావరి నదిని పరిశీలిస్తున్నకేటీఆర్

చిన్న సమస్యను చూపి అబాసుపాలు చేసే కుట్రలు

- కాంగ్రెస్ సర్కారు రైతులను ఆగం చేస్తున్నది
- ఆగస్టు 2లోగా పంపులు ఆన్ చేయాల్సిందే
- లేకుంటే 50 వేల మంది రైతులతో వచ్చి మేమే చేస్తాం
- మాజీ మంత్రి కేటీఆర్

పెద్దపల్లి, జూలై 26 (నమస్తే తెలంగాణ) : కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ సర్కారు దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో సాగిన బీఆర్ఎస్ ప్రతినిధి బృందం పర్యటన శుక్రవారం విజయవంతంగా సాగింది. గురువారం సాయంత్రం లోయర్ మానేరు డ్యాంను పరిశీలించిన బృందం, అదే రోజు రాత్రి పెద్దపల్లి జిల్లాకు చేరుకున్నది. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నాయకుల బృందానికి బసంత్‌నగర్, గోదావరిఖనిలో స్థానిక నాయకుల నుంచి ఘనస్వాగతం లభించింది. రాత్రి 11 గంటలకు ఎన్‌టీపీసీలోని జ్యోతిక గెస్ట్ హౌస్‌కు చేరుకొని రాత్రి అక్కడ బస చేయగా.. ఉదయం 8.30 గంటల ప్రాంతంలో పర్యటన ప్రారంభమైంది. గోదావరిఖని మీదుగా బ్రిడ్జి దాటుతుండగా.. ఎప్పుడూ నిండుకుండలా ఉండే గోదావరి బోసిపోయి కనిపించడంతో కేటీఆర్ తన వాహన శ్రేణిని నిలిపి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. తమ బృందంతో చర్చిస్తూ తిరిగి పర్యటనను ప్రారంభించారు. అనంతరం మంచిర్యాల జిల్లాలోకి ప్రవేశించగా శ్రీరాంపూర్ క్రాసింగ్ నుంచి దారిపొడవునా బీఆర్ఎస్ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా తమ అభిమాన నాయకుడు, ప్రతినిధులను ఘనంగా స్వాగతించారు. చెన్నూర్ నుంచి కాళేశ్వరం వరకు ఉన్న మహారాష్ట్ర సరిహద్దు గ్రామం సిరొంచ మీదుగా జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మెట్‌పల్లి మీదుగా కాళేశ్వరం చేరుకున్నారు. బృందం సభ్యులు నేరుగా కాళేశ్వర ముక్తీశ్వర స్వామి సన్నిధిలో ప్రత్యేకంగా పూజలు చేశారు. తర్వాత త్రివేణి సంఘమమైన గోదావరి తీరానికి చేరుకొని చీర సారె సమర్పించి, వాయినం ఇచ్చారు. అనంతరం నేరుగా కన్నెపల్లి పంపుహౌస్, ఫోర్‌బేను పరిశీలించి, అధికారులతో చర్చించారు. ఆ తర్వాత మీడియా సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత మేడిగడ్డ బ్యారేజీ వద్దకు వెళ్లి, దిగువకు ప్రవహిస్తున్న ప్రాణహిత జలాలను పరిశీలించారు.

రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అనతి కాలంలోనే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి రాష్ట్ర కరువును తరిమికొడితే.. కాంగ్రెస్, బీజేపీ నాయకులు చిన్న చిన్న సమస్యలను పెద్దవిగా చూపి ప్రాజెక్టు మొత్తాన్నే అబాసుపాలు చేసే కుట్రలకు దిగుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ ధ్వజమెత్తారు. సముద్ర మట్టానికి 80 నుంచి 90 మీటర్ల ఎత్తులో ఉన్న మేడిగడ్డ నుంచి 650 మీటర్ల ఎత్తులో ఉన్న కొండ పోచమ్మ వరకు గోదావరి జలాలను తరలించాలంటే ఎత్తిపోతలే సరైన మార్గమని స్పష్టం చేశారు. కానీ, కాంగ్రెస్ సర్కారు రైతులను ఆగం చేయాలని చూస్తున్నదని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని పంపులను ఆగస్టు 2 లోగా ఆన్ చేయకుంటే 50 వేల మంది రైతులతో వచ్చి తామే ఆన్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నాయకుల బృందంతో కలిసి శుక్రవారం పర్యటించిన ఆయన, మహదేవ్‌పూర్ మండలం కన్నెపల్లి వద్ద మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోయడంలో సర్కారు చేస్తున్న నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టారు. 90 టీఎంసీల కెపాసిటీ ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ఇన్‌ఫ్లో ఉన్నప్పటికీ 25 టీఎంసీల కంటే తక్కువగా నీళ్లు ఉన్నాయన్నారు. ఎగువన మహారాష్ట్ర నుంచి శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టుకు నీళ్లు వచ్చే పరిస్థితి లేదని, 24 టీఎంసీల కెపాసిటీ ఉన్న ఎల్ఎండీలో 5 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయని, 26 టీఎంసీల కెపాసిటీ ఉన్న మిడ్ మానేరులో సైతం 5 టీఎంసీలు మాత్రమే ఉన్నాయన్నారు. కరువు పీడిత ప్రాంతాలైన సిద్దిపేట, సిరిసిల్ల, మానకొండూర్, చొప్పదండి, హుస్నాబాద్, దుబ్బాక, గజ్వేల్, ఆలేరు, భువనగిరి వరకు సాగునీళ్లు ఇవ్వడంతో పాటు హైదరాబాద్‌కు సైతం మంచినీళ్లు అందించవచ్చని చెప్పారు. లక్ష్మీ పంప్ హౌస్ వద్ద 17 పంపులు రెడీగా ఉన్నాయని, ప్రతీ రోజు 2 టీఎంసీల నీటిని ఎత్తి పోసేలా ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ మూడు రోజులకు ఒకసారి తాగునీటిని సరఫరా చేస్తున్నదన్నారు. రోజుకు 10 లక్షల క్యూసెక్కుల నీటిని వృథాగా కిందికి వదిలి వేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నప్పటికీ రిజర్వాయర్లు మాత్రం నీరు లేక ఎడారిలాగా కనపడుతున్నాయన్నారు. ఐదారేండ్లపాటు నిండుగా దర్శనమిస్తున్న మిడ్ మానేరు ఇప్పుడు ఎడారిగా కనిపిస్తున్నదన్నారు. నీటిని లిఫ్ట్ చేస్తే రెండు రోజుల్లో శ్రీరాజరాజేశ్వర జలాశయానికి నీళ్లు చేరుకుంటాయని, కొండ పోచమ్మ, మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, అన్నపూర్ణ రిజర్వాయర్లు నింపవచ్చన్నారు. ఇలాంటి గొప్ప ప్రాజెక్టును కేసీఆర్ నిర్మిస్తే దానిని వాడుకునే తెలివి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేకపోవడం బాధాకరమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రైతుల పక్షాన అసెంబ్లీలో చర్చకు డిమాండ్ చేస్తామన్నారు. అనంతరం మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు వల్లే తమ ప్రాంతాలైన నల్లగొండ, భువనగిరి, సూర్యాపేట ప్రాంతాలు సస్యశ్యామలం అయ్యాయని, మానేరు డ్యాంకు పుష్కలంగా నీరంది గొప్పగా పంటలు పండాయని గుర్తు చేశారు. ఇప్పుడు సర్కారు రాజకీయ దురుద్దేశంతో మోటర్లను ఆన్ చేయడం లేదని నిలదీశారు. ఈ పర్యటనలో మాజీ మంత్రులు మల్లారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, సంజయ్ కుమార్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, విజయుడు, మురాగోపాల్, ఎమ్మెల్సీలు వాణీదేవి, నవీన్‌కుమార్, ఎల్ రమణ, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దుర్గం చిన్నయ్య, దివాకర్‌రావు, నారదాసు లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు చిరుమల్ల రాకేశ్, జక్కు రాకేశ్, కౌశిక్‌హరి, దాసరి ఉష పలువురు ఉన్నారు.

కాళేశ్వరంలో గోదావరికి పూజలు చేస్తున్న మాజీ మంత్రులు కేటీఆర్, గంగుల కమలాకర్, మల్లారెడ్డి, సబిత ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో నేత కార్మికులు

సర్కారు నిర్లక్ష్యంతోనే సంక్షోభం

- ప్రభుత్వ వైఖరికి నిరసనగా నేడు హైదరాబాద్‌లో భారీ ధర్నా
- టీపీవీయూ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్

రాజన్న సిరిసిల్ల, జూలై 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర సర్కారు నిర్లక్ష్యంతోనే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ అన్నారు. ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా శనివారం చలో హైదరాబాద్ పేరిట ఇందిరాపార్క్‌వద్ద భారీ ధర్నా నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్మికులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో ఐదు రోజులుగా కొనసాగుతున్న నేతన్నల రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ బతుకమ్మ చీరలు, యూని ఫాంలు, పండుగ దుస్తుల ఆర్డర్లు నిలిపివేసి, మరమగ్గాలకు ఇచ్చే రాయితీని ఎత్తేసి కార్మికుల కడుపుకొట్టిందని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మళ్లీ పాతరోజులు వచ్చాయని, సిరిసిల్ల కాస్త ఉరిసిల్లగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం బీఆర్ఎస్ సర్కారు అమలు చేసిన పథకాలను కొనసాగించాలని యార్న్ సబ్సిడీ, 10హెచ్‌పీల వరకు మరమగ్గాలకు ఉచిత విద్యుత్, 15కోట్ల మీటర్ల వస్త్ర ఆర్డర్లు ఇవ్వాలని, వర్కర్ టూ ఓనర్ పథకాన్ని పూర్తి చేసి కార్మికులను యజమానులుగా మార్చాలని డిమాండ్ చేశారు. ఇక్కడ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, సీపీఐ నాయకులు పంతం రవి, తాటి పాముల దామోదర్, గజ్జెల్లి శ్రీనివాస్, గాజుల నరేశ్, మచ్చవేణు, సామల శ్రీనివాస్, బచ్చు సదానందం, ఆకుబత్తిని లక్ష్మీనారాయణ ఉన్నారు.

చెరువంత నిర్లక్ష్యం

చెరువులో పెరిగిన గుర్రపు డెక్క

నిర్వహణ కరువై బోసిబోతున్న కోరుట్ల మినీ ట్యాంక్‌బండ్

కోరుట్ల, జూలై 26: కోరుట్ల మద్దుల చెరువు మినీ ట్యాంక్‌బండ్ కళ తప్పింది. పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు నిర్మించినా.. ఇప్పుడు నిర్వహణలోపంతో అధ్వానంగా మారింది. గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో ₹3.50కోట్లకుపైగా నిధులతో తీర్చిదిద్దినా.. నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారింది. విద్యుత్ స్తంభాలు తుప్పు పట్టిపోతున్నాయి. పిచ్చి మొక్కలు పెరిగాయి. వీధి దీపాలు వెలగడం లేదు. చెరువు మొత్తం గుర్రపు డెక్క పేరుకుపోయింది. బోటు, స్పీడ్ బోటు మూలన పడ్డాయి. గుర్రపు డెక్క తొలగింపు కోసం గతేడాది మున్సిపల్ నుంచి ₹14 లక్షలు కేటాయించినా, పనులు తూతూ మంత్రంగా చేసి వదిలేశారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ట్యాంక్‌బండ్‌ను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

మూలన పడ్డ స్పీడ్ బోటు

మక్కను కాపాడుకుందాం

- కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త మంజులత సూచనలు

కరీంనగర్, జూలై 26 (నమస్తే తెలంగాణ) : అధిక వర్షాల నుంచి మక్కను కాపాడుకునేందుకు యాజమాన్య పద్ధతులు చేపట్టాలని కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జీ మంజులత సూచించారు. కొద్ది రోజులుగా నుంచి వానలు పడుతండగా.. మక్క రక్షణ కోసం సూచనలు చేశారు. పంట ప్రస్తుతం శాకీయ దశలో ఉన్నదని, ఈ దశలో ఎక్కువ నీటిని తట్టుకోలేదని, నీటిని బయటకు వెళ్లే విధంగా వెంటనే కాలువలు తీయాలని చెప్పారు. నేలలో తేమ అధికమైనప్పుడు మొక్కలు పోషకాలను తీసుకోలేవని, ఈ నేపథ్యంలో పోషకాల లోపాలు ఏర్పడతాయని తెలిపారు. వర్షాలు నిలిచిన తర్వాత 19-19-19 అనే పోషకాన్ని 5 గ్రాముల చొప్పున లేదంటే డీఏపీ మందును 20 గ్రాములకు లీటరు నీటిని కలిపి మొక్కలపై పిచికారీ చేయాలని సూచించారు. వర్షాధార పంటలో అంతరకృషితో పాటు ఎకరాకు 20 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్‌ను వేసుకోవాలన్నారు. కత్తెర పురుగు నివారణకు ఎకరానికి 8 నుంచి 10 లింగాకర్షక బుట్టలను అమర్చుకొని, పైరు సుడులల్లో ఒక కిలో సున్నం, 9 కిలోల ఇసుకను కలిపి, ఈ మిశ్రమాన్ని వేసి నివారించుకోవచ్చని సూచించారు. మక్క పంటను వేసుకోవాలని అనుకున్న రైతులు జూలై 31 వరకు స్వల్పకాలిక రకాలను దిగుబడిలో ఎలాంటి తరుగుదల లేకుండా విత్తుకునేందుకు అనుకూల సమయమని వివరించారు.

జ్యోతిష్మతి పూర్వ విద్యార్థినికి భారీ ప్యాకేజీ

'ఎండ్వియా'లో ఆశ్రితకు ₹52 లక్షలతో ఉద్యోగం

ఎం ఆశ్రిత

తిమ్మాపూర్ రూరల్, జూలై 26: కరీంనగర్ జిల్లాలోని జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజీ పూర్వ విద్యార్థిని భారీ ప్యాకేజీతో ఉద్యోగం సాధించింది. ఎం ఆశ్రిత ₹52 లక్షల యాన్యువల్ సాలరీతో బెంగళూరులోని ఎండ్వియా కంపెనీలో ఏఎస్ఐసీ ఇంజినీర్‌గా ఎంపికైంది. రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన ఆశ్రిత ఓ సాధారణ రైతు కుటుంబంలో జన్మించింది. చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా ఉండే ఆశ్రిత 2022లో జ్యోతిష్మతిలో బీటెక్ పూర్తి చేసిందని కాలేజీ చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు తెలిపారు. గతంలో ఇస్రోలో ఇంజినీర్‌గా ఎంపికైనప్పటికీ ఆ ఉద్యోగాన్ని వదులుకున్నదని చెప్పారు. అలాగే రాజేశ్‌కుమార్ కాల్‌క్వామ్ ఇండియా కంపెనీలో ₹16.85లక్షల ప్యాకేజీతో అసోసియేట్ ఇంజినీర్ జాబ్ సాధించాడు. వీరిని కాలేజీ చైర్మన్‌తో పాటు కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జువ్వాడి సుమిత్ సాయి, ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ రావు, డీఎన్ పీకే వైశాలి అభినందించారు.

రాముని గుండాల జలపాతం

జల సోయగం

జ్యోతినగర్ (రామగుండం), జూలై 26: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో రామగుండం మండలంలోని రామునిగుండాల జలపాతం కనువిందు చేస్తున్నది. ఎత్తైన కొండ మీద నుంచి పాల నురగల్లా జాలువారుతున్న దృశ్యం పర్యాటకుల మదిని దోస్తున్నది. ఇక్కడి జల పరవళ్లను చూసేందుకు వస్తున్న సందర్శకులతో ఈ ప్రాంతం కళకళలాడుతున్నది. యువత సెల్‌ఫోన్లలో బంధిస్తూ, నీటి ధారల్లో తడిసిముద్దవుతూ సందడి చేస్తున్నది.

పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థి మృతి

- మరో ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత
- పాముకాటే కారణమని అనుమానం
- గురువారం అర్ధరాత్రి పాఠశాలలో కలకలం
- ప్రిన్సిపాల్ నిర్లక్ష్యమేనంటూ బంధువుల ఆరోపణ

రాజారపు గణాధిత్య (ఫైల్)

కొడుకు మృతితో రోదిస్తున్న లావణ్య

మెట్‌పల్లి రూరల్, జూలై 26: మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గురుకుల స్కూల్‌లో గురువారం అర్ధరాత్రి ఓ విద్యార్థి మరణించడం, మరో ఇద్దరు అస్వస్థతకు గురికావడం కలకలం రేపింది. స్థానికుల వివరాల ప్రకారం.. మెట్‌పల్లి మండలంలోని ఆరపేటకు చెందిన రాజారపు గణాధిత్య (13) పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. గురువారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి నేలపై నిద్రపోయాడు. అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత అస్వస్థతకు గురైన గణాధిత్య వాంతులు చేసుకొని కుప్పకూలిపోయాడు. తోటి విద్యార్థులు కేర్‌టేకర్ వెంకట్‌కు విషయం తెలుపగా, ఆయన ప్రిన్సిపాల్ విద్యాసాగర్‌కు సమాచారమందించారు. ఆరపేటలోని తండ్రి మహేశ్‌కు తెల్లవారుజామున 3.45 గంటలకు ప్రిన్సిపాల్ ఫోన్ చేసి మీ కొడుకు అస్వస్థతకు గురయ్యాడని, వెంటనే తీసుకెళ్లాలని సూచించారు. దీంతో ఆందోళన చెందిన తండ్రి, తన స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై హుటాహుటిన గురుకుల పాఠశాలకు వెళ్లాడు. అప్పటికే పాఠశాలలో బోర్లాపడిపోయిన కొడుకును అదే బైక్‌పై మెట్‌పల్లిలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్టు నిర్ధారించారు. అలాగే ఎనిమిదో తరగతికి చెందిన హర్షవర్ధన్, గణేశ్ అనే విద్యార్థులు కూడా అస్వస్థతకు గురయ్యారు. గణేశ్‌ను నిజామాబాద్ దవాఖానకు, హర్షవర్ధన్‌ను మెట్‌పల్లి వైద్యశాలకు తరలించారు. అయితే గణేశ్‌ను పరీక్షించిన వైద్యులు పాముకాటు వల్లే అస్వస్థతకు గురయ్యాడని తెలిపారు. గణాధిత్య కూడా పాముకాటు కారణంగానే మరణించాడని తోటి విద్యార్థులు భావిస్తున్నారు. కాగా, అస్వస్థతకు గురైన విద్యార్థులను దవాఖానకు తీసుకెళ్లకుండా ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం చేశాడని విద్యార్థుల కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. వెంటనే దవాఖానకు తీసుకెళ్తే తమ కొడుకు బతికేవాడని గణాధిత్య తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్‌చార్జి ఎంఈవో భీమయ్య, కోరుట్ల ఎస్ఐ కిరణ్ గురుకుల పాఠశాలకు చేరుకొని విచారణ జరిపారు. భయాందోళనకు గురైన పలువురు గురుకుల స్కూల్ విద్యార్థులు ఇండ్లకు వెళ్లిపోయారు.

ఆ తల్లికి పుట్టెడు దుఃఖం

ముగ్గురు కొడుకుల మృతితో కన్నీరుమున్నీరు

ఆరపేటకు చెందిన రాజారపు మహేశ్ – లావణ్య దంపతులకు ముగ్గురు కొడుకులు. కాగా, పెద్ద కొడుకు, మూడో కొడుకు గతంలోనే అనారోగ్యంతో మృతి చెందారు. ప్రయోజకుడై తమ బాగోగులు చూస్తాడని ఆశలు పెట్టుకున్న రెండో కొడుకు గణాధిత్య ఇప్పుడు అనుకోని రీతిలో మృతి చెందడం ఆ తల్లిదండ్రులకు పుట్టెడు దుఃఖాన్ని మిగిల్చింది. 'మేమేం పాపం చేశామని.. దేవుడు మాకు ఇంత అన్యాయం చేశాడు' అంటూ గుండెలవిసేలా రోదించిన తీరు గ్రామస్తులను కలిచివేసింది.

గొర్రె పిల్లను కాపాడి..

అదుపుతప్పి బావిలోపడి గొర్రెల కాపరి మృతి

బొందయ్య (ఫైల్)

చిగురుమామిడి, జూలై 26: బావిలో పడ్డ గొర్రెపిల్లను కాపాడిన ఓ కాపరి పైకి వచ్చే క్రమంలో ప్రాణాలు కోల్పోయాడు. పట్టు తప్పి అదే బావిలో పడి చనిపోయాడు. పోలీసుల వివరాల ప్రకారం.. చిగురుమామిడి మండలం రేకొండకు చెందిన మొగిలి బొందయ్య (65) ప్రతి రోజూ మాదిరిగానే శుక్రవారం గొర్రెల మందను ఊరి శివారులోని తాటి వనం వద్దకు మేతకు తీసుకెళ్లాడు. మందలోని ఓ గొర్రెపిల్ల సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో పడిపోయింది. గమనించిన బొందయ్య బావిలోకి దిగి తాడు సహాయంతో బయటకు తీశాడు. అదే తాడు పట్టుకొని పైకి వచ్చేందుకు వస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో పడి నీట మునిగి మరణించాడు. చుట్టుపక్కల రైతులు బావివద్దకు చేరుకొని రెండు మోటర్ల సాయంతో నీటిని తోడి మృతదేహాన్ని బయటకు తీసేందుకు విఫలయత్నం చేశారు. పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ బండి రాజేశ్ గజఈతగాళ్లను రప్పించి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్ట్‌మార్టం కోసం హుస్నాబాద్ దవాఖానకు తరలించారు. బొందయ్యకు భార్య లింగవ్వ, ఇద్దరు కొడుకులు ఓదెలు, శ్రీనివాస్ ఉన్నారు. ఓదెలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.